సాక్షి శ్రీకాకుళం

శుక్రవారం ၊ 5 ၊ సెప్టెంబర్ ၊ 2025

7న శ్రీముఖలింగం ఆలయం ఆదివారం మూసివేత

జలుమూరు: సంపూర్ణ చంద్రగ్రహణం కారణంగా ఆదివారం మధ్యాహ్నం రెండు గంటలకు ఆలయం మూసివేయనున్నామని ఆలయ ఈఓ టి.వాసుదేవరావు గురువారం తెలిపారు. సంప్రోక్షణ, శుద్ధి అనంతరం సోమవారం ఆలయం తెరిచి యథావిధిగా భక్తులకు స్వామి దర్శన భాగ్యం కల్పిస్తామని ఈఓ తెలిపారు.



మద్యం దందా

కొమనాపల్లి కేంద్రంగా మద్యం దందా సాగుతోంది. బెల్టుషాపులకు సరుకు వెళ్తోంది.

-8లో..

రాష్ట్ర ఉత్తమ అధ్యాపకుని అవార్డుకు జనార్ధనరావు ఎంపిక

శ్రీకాకుళం న్యూకాలనీ, టెక్కలి: రాష్ట్రస్థాయి ఉత్తమ అధ్యాపక అవార్డుకు జిల్లాకు చెందిన రుంకు జనార్ధనరావును రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసింది. ఈయన జిల్లాలోని టెక్కలి మండల పరిధిలోని నౌపడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జువాలజీ అధ్యాపకునిగా పనిచేస్తున్నారు. ఈయన టెక్కలి, నౌపడ, నందిగాం జూనియర్ కళాశాలలకు ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్‌గా వ్యవహరించి మన్ననలు పొందారు.

న్యూస్‌రీల్

నార పంటల విస్తీర్ణం పెరగాలి

ఆమదాలవలస: జనప నార, గోగు వంటి నార పంటల సాగు పెరిగే దిశగా పరిశోధనలు చేపట్టాలని, ఆంధ్రప్రదేశ్‌లో ఉత్తర కోస్తా మండలాలు ఈ పంటల సాగుకు అనుకూలమని జూట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా జోనల్ మేనేజర్ సంతోష్ కుమార్ బాలే అన్నారు. ఆమదాలవలస వ్యవసాయ పరిశోధన స్థానం, కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సమన్వయంతో నిర్వహించిన రైతు, శాస్త్రవేత్తల ముఖాముఖి కార్యక్రమంలో గురువారం ఆయన పాల్గొన్నారు. ముందుగా పరిశోధన స్థానం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ జి.చిట్టిబాబు ఉత్తర కోస్తా జిల్లాల్లో సాగవుతున్న గోగు, జనపనార పంటల్లో రైతుల ఎదుర్కొంటున్న సమస్యలను, మార్కెటింగ్ వివరాలను తెలియజేశారు. ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా నారపంటల సాగు పెరగాలంటే అధిక మార్కెట్ ధర కల్పించాలని కొంతమంది రైతులు అధికారులకు తెలియజేశారు. జూట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా పార్వతీపురం మేనేజర్ ఆర్.అరుణ్ కుమార్ మాట్లాడుతూ నార ఊర వేయడానికి, చిరుచెరువులను తవ్వుకోవడానికి ప్రభుత్వం ద్వారా పథకాలు ఉన్నాయని రైతులకు తెలియజేశారు.

పరిశ్రమ వాహనాల అడ్డగింత



వాహనాలను అడ్డుకుని నిరసన తెలుపుతున్న పిషిణీ గ్రామస్తులు

రణస్థలం: మండలంలోని నెలివాడ కూడలి నుంచి చిల్లపేట రాజాం వైపు వివిధ పరిశ్రమలకు వెళ్తున్న భారీ వాహనాలను పిషిణి గ్రామస్తులు అడ్డగించారు. ఈ వాహనాల వల్ల దారి గోతులమయంగా మారుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. పరిశ్రమ యాజమాన్యాలకు ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసిన ఫలితం లేకుండా పోయిందని చెప్పారు. యాజమాన్యాలు స్పందించి రహదారులు బాగు చేయాలని కోరారు. గురువారం ఉదయం డ్యూటీలకు వెళ్లే సమయంలో సుమారు 3గంటల పాటు వాహనాలు అడ్డగించడం వల్ల దారిలో రాకపోకలు స్తంభించిపోయాయి. జేఆర్ పురం ఎస్‌ఐ ఎస్.చిరంజీవి గ్రామస్తులతో మాట్లాడి వారం రోజుల్లో పరిశ్రమ యాజమాన్యాలతో సమావేశం ఏర్పాటు చేస్తామని అప్పటి వరకు నిరసనలు తెలపవద్దని సూచించారు.

నిలువరిస్తారా.. నీరుగారుస్తారా..?



- నకిలీ మద్యం కేసుపై అనుమానాలెన్నో?
- నకిలీ మద్యం సామాన్యుడిపై మృత్యు బాణమే
- సూత్రధారిగా భావిస్తున్న నీలకంఠంకు నేతలతో పాటు ఎక్సైజ్‌లోని కొందరి అండదండలు
- రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గితే ప్రజల ప్రాణాలకే ప్రమాదం
- తేడా జరిగితే ఎక్సైజ్ శాఖ మెడకు చుట్టుకోనున్న కేసు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

వేల సంఖ్యలో ఖాళీ సీసాలు, నకిలీ మూతలు, బ్యాచ్ నంబర్ స్టాంపింగ్ మిషన్.. సహా సమస్త సామగ్రి అతని వద్ద ఉంది. ఇంతటి స్థాయిలో నకిలీ మద్యం తయారు చేస్తున్న సకలాభక్షుల నీలకంఠం అనే వ్యక్తి ఇప్పుడు ఎక్సైజ్ సర్కిళ్లలో హాట్ టాపిక్‌గా మారాడు. అయితే నీలకంఠంకు ఎక్సైజ్ శాఖలోని కొందరి అధికారులతో గట్టి సంబంధాలు ఉన్నాయా? రాష్ట్ర స్థాయిలో మేనేజ్ చేసే సత్తా గల వ్యక్తా? ఇప్పుడాయన కుట్ర గుట్టు రట్టు చేస్తారా? సాదాసీదా కల్తీ కేసుగా నీరు గార్చేస్తారా? అన్న అనుమానాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. నిందితుడికి నేతల అండదండలు ఉండనే ఉన్నాయి. దానికితోడు కొందరు అధికారులతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. ఈ రెండూ కలవడం వల్లనే కేసు విచారణపై సందేహాలు కమ్ముకున్నాయి.

భారీగా లాభాలు.. ముడుపులు

సారవకోట మండలం అవలింగి సమీపంలోని దుర్గా వైన్ షాపు, సమీపంలోని ఇంట్లో దొరికిన నకిలీ మద్యం వ్యవహారం చిన్నదేమీ కాదు. మందుబాబుల ప్రాణాలు తీసే మద్యంగా అనుమానాలు ఉన్నాయి. ఒడిశా, చత్తీస్‌గఢ్ నుంచి తీసుకొచ్చిన ఆల్కహాల్‌కు కలర్ కలిపి నకిలీ మద్యం తయారు చేసి, బాటిలింగ్ చేసి విక్రయిస్తున్నట్టుగా ఆరోపణలు ఉన్నాయి. దానికోసమే ఏకంగా ఇల్లు అద్దెకు తీసుకుని, ఆర్గనైజ్డ్ క్రైమ్ చేస్తున్నట్టుగా తెలుస్తోంది. ఆ ఇంట్లో వేలల్లో ఖాళీ సీసాలు, నకిలీ మూతలు, బ్యాచ్ నంబర్ స్టాంపింగ్ మిషన్ వంటివి దొరికాయి. దీన్నిబట్టి అక్కడెంత పథకం ప్రకారం నకిలీ మద్యం తయారు చేస్తున్నారో అర్థం చేసుకోవచ్చు.



నీలకంఠం అద్దెకు తీసుకున్న ఇంట్లో దొరికిన ఖాళీ సీసాలు, మూతలు, మద్యం

ఈ వ్యాపారంలో భారీగా లాభాలు ఉంటాయి. ముడుపులు కూడా అదే స్థాయిలో ఉంటాయి.

ముడుపుల మత్తులో...

జిల్లాలో ఇప్పటికే ప్రభుత్వం మద్యంలో అడల్ట్రేషన్ జరుగుతోంది. కాస్ట్లీ లిక్కర్‌లో చీప్ లిక్కర్ కలపడం, చీప్ లిక్కర్‌లో నీరు కలపడం వంటివి సాధారణమైపోయాయి. 10 రోజుల కిందట టెక్కలిలో 55 ఏళ్ల వయసు గల వ్యక్తి ఓ వైన్‌షాపులో మద్యం బాటిల్ కొనుగోలు చేస్తే.. మూత లూజ్‌గా ఉండటం గమనించారు. ఇదేంటి లూజుగా ఉందని ఆ వ్యక్తి నిలదీస్తే షాపులో ఉన్న వారు 'ఎక్కువ వాగకు..' అంటూ మెడపెట్టి తోసేశారు. దీంతో ఆ వ్యక్తి కింద పడిపోయి కన్నీటి పర్యంతమయ్యారు. ఇలాంటి సంఘటనలు అనేకం ఉన్నాయి. కల్తీ మద్యం ఎక్కువగా గ్రామీణ ప్రాంతాల్లోని లైసెన్సు దుకాణాలతో పాటు జిల్లా వ్యాప్తంగా ఉన్న బెల్ట్ దుకాణాల్లో విక్రయిస్తున్నట్టుగా తెలుస్తోంది. ఇదంతా ఎక్సైజ్ శాఖకు తెలిసినప్పటికీ ముడుపుల మత్తులో చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

చెలరేగిపోయారా?


నకిలీ మద్యం దొరికిన ఇంటిని అద్దెకు తీసుకున్న నీలకంఠంకు గత చరిత్ర ఎంతో ఉంది. ఎక్సైజ్ శాఖలో అతనికి పట్టు ఉంది. ఉన్నతాధికారులతో సత్సంబంధాలు ఉన్నాయి. ఎక్సైజ్ అక్రమాల్లో ఆరితేరిపోయారు. గతంలో కూడా మద్యం దందాలో ఆయనపై ఆరోపణలు, ఫిర్యాదులు వచ్చినప్పటికీ ఆ శాఖలో ఉన్న పరిచయ అధికారుల ద్వారా తప్పించుకున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇప్పుడదే వ్యక్తికి జిల్లాలోని కీలక నేత సోదరుడు అండదండలు ఉన్నాయి. దాంతో బరితెగించి నకిలీ మద్యం తయారు చేస్తున్నట్టుగా అనుమానాలు ఉన్నాయి. ఈ నకిలీ మద్యం రాకెట్ ఎక్కడెక్కడికి విస్తరించిందో వారికే తెలియాలి. జిల్లాలో ఎన్ని ప్రాంతాలకు వెళ్తుంది? రాష్ట్రంలోని మిగతా ప్రాంతాలకు కూడా తరలిస్తున్నారా? అన్నది మిస్టరీగా ఉంది. ప్రస్తుతం నీలకంఠం ఫోన్ ఆఫ్ చేసి పరారీలో ఉన్నారు. పక్కా ఏర్పాట్లు చేసుకుని దొరికినా ఎక్సైజ్‌లోని ఉన్నతాధికారులు, నేతల ఆశీస్సులు ఉండటంతో ఎంతమేరకు కేసు సజావుగా నడుస్తుందో అన్నదానిపై సందేహాలు ఉన్నాయి.

ప్రాణాలతో చెలగాటమే..

నకిలీ మద్యం చాలా డేంజర్. నకిలీ మద్యం తాగి చనిపోయిన ఘటనలు గతంలో ఎన్నో ఉన్నాయి. మరణాలు కూడా అంతుచిక్కని విధంగా జరిగాయి. ఇలాంటి కేసును సీరియస్‌గా తీసుకుని విచారణ జరిపితే మందుబాబుల ప్రాణాలను నిలిపినట్టు అవుతారు. ఒత్తిళ్ల కారణంగా కేసును నీరు గార్చినా, పక్కదారి పట్టేలా విచారణ చేసినా ప్రజల ప్రాణాలతో చెలగాటమాడినట్టే. నకిలీ మద్యంతో మరణాలు సంభవిస్తే అధికారులే బాధ్యులు కావాల్సి వస్తుంది.

గురవే నమః

- నేడు ఉపాధ్యాయ దినోత్సవం



బాల్యం గుర్తుకు తెచ్చుకుంటే సగం జ్ఞాపకాలు వారివే. కౌమార వయసును జ్ఞప్తికి తెచ్చుకున్నా కనిపించే ముఖాలు ఆ మనుషులవే. యవ్వనపు రోజుల్ని ఎప్పుడైనా తలచుకున్నా కంటి ముందు మెదిలేవారు వారే. ఉపాధ్యా యులు కేవలం ఉద్యోగులు మాత్రమే కారు.. మన బతుకులో భా గం వారు. బడిలో ఉన్నంత కాలం ఎంత కష్టపెట్టినా.. ఆ బడి దాటి బయటకు వెళ్లాక వారిపై ఇష్టం వెయ్యింతలు పెరుగుతుంది. మాస్టారు, మేడమ్ అన్న పిలుపు అమ్మానాన్న అంత ఆప్యాయంగా మారిపోతుంది. అందరి విజయాల వెనుక పునాదులు వేసే ఆ శ్రామికుల రోజు ఇది. నేడు ఉపాధ్యాయ దినోత్సవం. ఈ సందర్భంగా కొందరు టీచర్ల గురించి..

– ఇచ్ఛాపురం రూరల్, నరసన్నపేట

హస్తిన వరకు మన ఖ్యాతి..



విద్యార్థులకు జీవశాస్త్ర పాఠాలు చెప్పే బూరవెల్లి ఉమామహేశ్వరి తరగతి గదితో పాటు నిజ జీవితంలోనూ సమస్యలకు పరిష్కా రం చూపేలా విద్యార్థులతో ప్రయోగాలు చేయిస్తున్నారు. ఆమె మార్గదర్శకత్వంలో రూపొందించిన 'నేషనల్ హెయిర్ డై' ప్రాజెక్ట్ ఆంధ్ర ప్రదేశ్ నుంచి జాతీయ స్థాయికి ఎంపికైన రెండు ప్రాజెక్టులలో ఒకటి కావడం విశేషం. ఈదుపురం ఉన్నత పాఠశాలలో ప్రస్తుతం ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తున్న ఈమె విద్యార్థి అభివృద్ధిలో భాగస్వాములవుతున్నారు.

క్యూ ఆర్ కోడ్ రూపకల్పన



ఒరియా మాధ్యమం పాఠ్యాంశాలను క్యూఆర్ కోడ్‌లో అప్‌లోడ్ చేస్తున్న చంద్రశేఖర్

ఇచ్ఛాపురం మండలం కీర్తిపురం ఒడియా ఆద ర్శ ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న చంద్రశేఖరం రానా 'దీక్ష ఈ– కంటెంట్' ద్వారా మైనార్టీ మీడియా పాఠ్యపుస్తకాల్లోని పాఠ్యాంశాలకు సంబంధించి చిత్రాలు, కథలు, ఇతరత్రా భా షాంశాలను 'క్యూఆర్ కోడ్'లో అప్‌లోడ్ చేస్తున్నారు. అందుకు రాష్ట్ర విద్యాశాఖ ప్రత్యేక శిక్షణ ఇచ్చినట్లు చెబుతున్నారు. ఇంగ్లిష్, గణితం, సైన్స్, సోషల్ వంటి సబ్జెక్టులను బోధిస్తుంటారు.

బడిని బతికించి



ఎర్ర జెండాతో విద్యార్థులను రోడ్డు దాటిస్తూ..

ఈదుపురం కంచ్ర వార్డు ప్రాథమిక పాఠశాల రోడ్డు పక్కనే ఉండటంతో తరచూ విద్యార్థులు ప్రమాదాల బారిన పడుతుండేవారు. దీంతో తల్లిదండ్రులు పిల్లలను ఈ బడికి పంపడం మానేశారు. ఈ క్రమంలో అక్కడ హెచ్‌ఎంగా బాధ్యతలు చేపట్టిన ప్రభాస్ రంజన్ పట్నాయక్ విద్యా ర్థుల తల్లిదండ్రులకు భరోసా కల్పించారు. ఉద యం ఎనిమిది గంటలకే బడికి చేరుకొని చేతిలో ఎర్రజెండాను పట్టుకొని రోడ్డెక్కి విద్యార్థులు రోడ్డు దాటే సమయంలో వాహనాలకు రెడ్ సిగ్నల్ ఇవ్వడం, మళ్లీ సాయంత్రం బడి విడిచిపెట్టే సమయంలో ఎర్ర జెండాతో రోడ్డెక్కి విద్యార్థులు రోడ్డు దాటే వరకు వాహనాలను ఆపుతారు.

జీతానికి న్యాయం



విద్యార్థులతో యాక్టివిటీస్ చేయిస్తున్న అప్పయ్య

నరసన్నపేట: అవార్డుల కోసం కాదు.. నేను తీసుకుంటున్న జీతానికి.. నా ఉపాధ్యాయ వృత్తికి న్యాయం చేస్తున్నా అని అంటుంటారు నక్క అప్పయ్య మాస్టారు. 2023లో బసివలస స్కూల్‌కు ఆయన బదిలీపై వచ్చారు. ఆయన వచ్చే నాటికి ఇక్కడ పిల్లల సంఖ్య 19. ఇప్పుడు 29. అందరూ ఆంగ్లంలో మాట్లాడతారు. 'ద నెక్స్‌జెన్స్' అని ఒక యూట్యూబ్ చానల్ స్కూల్ పేరున పెట్టారు. ఇందులో విద్యార్థుల కృత్యాలు ఉంటాయి. స్కూల్ పేరున ఒక వెబ్‌సైట్ కూడా రూపొందించి పిల్లల సమగ్ర సమాచారం పెడుతున్నారు.

వాగు దాటితేనే నాటు



ఖరీఫ్‌లో నాట్లు వేసేందుకు బూర్జపాడు రైతులు అవస్థలు పడుతున్నారు. పొలాలకు ఆనుకొని ప్రవహిస్తున్న నడిమి గెడ్డ, నాసిగెడ్డలు పొంగి పొర్లుతున్నాయి. దీంతో పీకలోతు వరకు మునిగి పొలాలకు వెళ్లాల్సిన అవస్థ ఏర్పడింది. ఈ ప్రాంతంలో వంతెన నిర్మిస్తే తమకు ప్రయోజనంగా ఉంటుందని రైతులు చెబుతున్నారు.

- ఇచ్ఛాపురం రూరల్

తప్పని అవస్థ



టెక్కలి మండలం రోకళ్లపల్లి గ్రామం వద్ద రాకపోకలకు ఆయా గ్రామాల ప్రజలు పడుతున్న అవస్థలు వర్ణనాతీతంగా కనిపిస్తున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు గెడ్డ ఉధృతి ఇంకా తగ్గకపోవడంతో అనారోగ్యంతో బాధ పడుతున్న వ్యక్తిని తీసుకెళ్లేందుకు ఇన్ని ఇక్కట్లు పడ్డారు.

- టెక్కలి

కానిస్టేబుల్‌పై దాడిచేసిన యువకులపై కేసు

- దాడి చేసిన వారిలో ఒకరు దేవాలయ చోరీ కేసులో నిందితుడు
- పోలీసుల విచారణలో బయటపడిన వాస్తవం
- టీడీపీ సోషల్ మీడియా ఇన్‌చార్జినంటూ హల్‌చల్..
- కేసు నమోదు చేయవద్దని ఒత్తిడి

శ్రీకాకుళం క్రైమ్: శ్రీకాకుళం రామలక్ష్మణ కూడలిలో విధులు నిర్వర్తిస్తున్న ట్రాఫిక్ కానిస్టేబుల్ డి.హేమచంద్రపై తిరగబడిన ముగ్గురు యువకులపై పోలీసులు బుధవారం రాత్రి కేసు నమోదు చేశారు. నిందితుల్లో ఒకరు తాను టీడీపీ ఎమ్మెల్యే కార్యాలయంలో సోషల్ మీడియా ఇన్‌చార్జిని అంటూ హల్‌చల్ చేయడం గమనార్హం. వివరాల్లోకి వెళితే.. ఈ నెల 30న రామలక్ష్మణ కూడలిలో రెండో షిఫ్ట్‌లో డి.హేమచంద్ర విధులు నిర్వర్తిస్తుండగా సాధు పవన్‌కుమార్ ఒక్క చేత్తో బండి నడుపుతూ వచ్చాడు. కానిస్టేబుల్ ఆపినా ఆపకుండా వెళ్లిపోయాడు. అక్కడికి కాసేపట్లోనే అదే బండిపై పవన్ సోదరుడు సాధు ప్రవీణ్ నిర్లక్ష్యంగా రావడంతో హేమచంద్ర ఆపారు. ఈలోగా సాధు పవన్‌కుమార్, కీర్తి భార్గవనాయుడు నడుచుకుంటూ వస్తూ హేమచంద్రతో వాగ్వాదానికి దిగారు. 'నువ్వు ఆ ఫ్టాల్ కానిస్టేబుల్...వి.. కేసు కట్టే అర్హత నీకెవడిచ్చాడు' అంటూ కానిస్టేబుల్‌పై దాడి చేసి .. రెచ్చిపోయారు. 'నేనెవరో తెలుసా.. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో సోషల్ మీడియా ఇన్‌చార్జిని' అంటూ చెప్పడమే కాక ఎమ్మెల్యే పీఏ అజయ్ అనే టీడీపీ వ్యక్తితో ఫోన్లు చేయించాడు. దీనిపై ఆ కానిస్టేబుల్ ట్రాఫిక్ సీఐ నాగరాజుకు సమాచారం ఇచ్చినా వారిపై చర్యలు తీసుకోలేదు. విషయం ఎస్పీ మహేశ్వర రెడ్డి వరకు వెళ్లడం, అదే సమయంలో నిందితులను తప్పించాలంటూ ఓ జైళ్ల శాఖకు చెందిన వ్యక్తి ఒత్తిడి తీసుకురావడంతో ఎస్పీ దీనిపై విచారణ చేయాలని రెండో పట్టణ సీఐ ఈశ్వరరావును ఆదేశించారు. సీసీ ఫుటేజీలు పరిశీలించాక అసలు విషయం తెలిసింది. ఇందులో విశేషం ఏమిటంటే.. ఈ కేసులోని నిందితుల్లో ఒకరైన భార్గవ నాయుడు 2021లో నానుబాలవీధి వినాయక ఆలయంలో చోరీ కేసులో నిందితుడని గుర్తించారు. ఓ టెంపుల్ అఫెండర్‌ను కానిస్టేబుల్ ఫొటోలు తీస్తే ఫైన్లు వేయలేని స్థితిలో అధికారులున్నారంటూ ట్రాఫిక్ సీఐకి ఎస్పీ చీవాట్లు పెట్టినట్లు సమాచారం. బుధవారం రాత్రి ముగ్గురు యువకులపై రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు.

మూలపేటపై అధికారమదం

అధికార పార్టీకి చెందిన వారేమో యథేచ్ఛగా దాడులకు పాల్పడతారు. ఇష్టం వచ్చిన సమయానికి ఇంటికి వచ్చి మరీ బెదిరిస్తారు. కానీ వీరిపై ఎలాంటి చర్యలు ఉండవు. ఇంటికొచ్చి కొట్టినా ఏమీ కానట్టే ఖాకీలు వ్యవహరిస్తారు. విపక్ష నాయకుడైతే మాత్రం గల్లా పట్టుకుని స్టేషన్‌కు తీసుకెళ్లేంత తెగువ చూపిస్తారు. ఎందుకని ప్రశ్నిస్తే దాడి చేయడానికి కూడా వెనుకాడరు. సంతబొమ్మాళి మండలం మూలపేటలో పరిస్థితి ఇది. ఏ రాజ్యాంగాన్ని అనుసరిస్తున్నారో గానీ ఇక్కడ ప్రాథమిక హక్కులకు రక్షణ లేకుండాపోయింది.



బుధవారం మూలపేట సర్పంచ్ ఇంటిపై దాడికి ప్రయత్నిస్తున్న టీడీపీ నాయకుడు జీరు భీమారావు తదితరులు

- మూలపేటలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై ఎస్‌ఐ దాడి
- దాడిని నిరసిస్తూ పోలీస్‌స్టేషన్ ముందు నిరసన
- టెక్కలి డీఎస్పీకి ఫిర్యాదు

సంతబొమ్మాళి: మండలంలోని మూలపేటపై రెడ్ బుక్ రాజ్యాంగం పడగ నీడ పడింది. అందరినీ సమదృష్టితో చూసి శాంతిభద్రతలు కాపాడాల్సిన పోలీసులు అధికార పక్షమైతే ఒకలా, విపక్షమైతే మరోలా ప్రవర్తిస్తున్నారు. ఈ వైఖరి గ్రామంలో సమస్యలు రేకెత్తిస్తోంది. ఈ గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త, సర్పంచ్ తమ్ముడైన జీరు విశ్వనాథంపై నౌపడ ఎస్‌ఐ నారాయణస్వామి దాడి చేయడంతో గ్రామస్తులంతా పోలీస్‌స్టేషన్ ముందు గురువారం నిరసన చేపట్టారు. మూలపేట సర్పంచ్ జీరు బాబూరావు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం..

మూలపేట గ్రామానికి చేపల కట్టు వేలం పాట, ఇతర మార్గాల ద్వారా ఆదాయం వస్తుంది. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత స్థానిక సర్పంచ్ జీరు బాబూరావు ఆధ్వర్యంలో గ్రామానికి వచ్చిన డబ్బులను 12 మంది కమిటీ సభ్యులను ఏర్పాటు చేసి వారి అకౌంట్లో రూ. 32 లక్షలు జమ చేశారు. అలాగే గ్రామానికి చెందిన మరో నలుగురి ఖాతాల్లో రూ. 40లక్షలు జమ చేశారు. గ్రామానికి సంబంధించి ఏవైనా కార్యక్రమాలు జరిగితే ఈ డబ్బు ఖర్చు చేసేవారు. అయితే టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామానికి సంబంధించిన డబ్బులు తమకు ఇవ్వాలని టీడీపీ మండలాధ్యక్షుడు, మాజీ సర్పంచ్ జీరు భీమారావు అడిగారు. మీ హయాంలో మీ వద్దనున్న రూ.60లక్షల ఏమయ్యావో చెప్పాలని, ఆ డబ్బు ఊరికి ఇస్తే తమ వద్ద ఉన్న డబ్బులు అప్పగిస్తానని సర్పంచ్ బాబూరావు సమాధానం ఇచ్చారు. దీనిపై వివాదం చెలరేగింది. డబ్బుల కోసం పోలీసుల ద్వారా కూడా ప్రయత్నించి విఫలమయ్యారు. దీంతో టీడీపీ నాయకుడు జీరు భీమారావు ఆధ్వర్యంలో టీడీపీ కార్యకర్తలు బుధవారం సాయంత్రం మూలపేట సర్పంచ్ జీరు బాబూరావు ఇంటికి వెళ్లారు. ఆయన లేకపోవడంతో సర్పంచ్ తండ్రిపై దాడి చేశారు. గ్రామంలో గొడవలు వద్దని విషయం తెలిసినా సర్పంచ్ బాబూరావు మిన్నకుండిపోయారు. కానీ గురువారం టీడీపీ నాయకుల ఒత్తిడితో రొయ్యల చెరువు వద్ద ఉన్న వైఎస్సార్‌సీపీ కార్యకర్త మంగి రామారావును పోలీస్ స్టేషన్‌కు తీసుకుని రావడానికి నౌపడ ఎస్‌ఐ నారాయణస్వామి ప్రయత్నించారు.



ఎందు కు తీసుకెళ్తున్నారని ప్రశ్నించిన సర్పంచ్ తమ్ముడు జీరు విశ్వనాథంపైన ఎస్‌ఐ ఇష్టానుసారం దాడి చేశారు. ముఖం, గుండెపైన చేతులతో దాడి చేసి షర్టు చింపి వేసి అక్కడ ఉన్న మంగి రామారావును పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లిపోయారు. గాయపడిన జీరు విశ్వనాథం టెక్కలి జిల్లా ఆస్పత్రిలో చేరారు. దీనిపై ఊరుఊరంతా మండిపడింది. మహిళలతో పాటు గ్రామస్తులు పోలీస్‌స్టేషన్‌కు వచ్చి నిరసన తెలిపారు. మంగి రామారావును విడిచి పెట్టేంత వరకు వెళ్లబోమని తేల్చి చెప్పారు. విచారించి కొద్దిసేపట్లో విడిచిపెడతామని పోలీసులు చెప్పడంతో సర్పంచ్ జీరు బాబూరావుతో పాటు గ్రామస్తులు వెను తిరిగారు. దీనిపై గ్రామస్తులు టెక్కలి డీఎస్పీకి ఫిర్యాదు చేశారు.

నడిరోడ్డుపై నిలదీత

గ్రామాల్లో తగాదాలకు కారణమవుతున్న టీడీపీ మండలాధ్యక్షుడు, మూలపేట మాజీ సర్పంచ్ జీరు భీమారావును నౌపడలో నడి రోడ్డుపైన మహిళలు, గ్రామస్తులు నిలదీశారు. మంగి రామారావును పోలీస్ స్టేషన్‌కు తీసుకుని రావడానికి జీరు భీమారావే కారణమని తెలుసుకున్న గ్రామస్తులు అతని ఇంటికి వెళ్లడానికి బయల్దేరగా.. సమాచారం తెలుసుకున్న జీరు భీమారావు తన ఇంటి నుంచి వేరొక చోటకు వెళ్లిపోవడానికి ప్రయత్నించారు. అయితే నౌపడ మెయిన్‌రోడ్డులో ద్విచక్ర వాహనంపై వస్తున్న జీరు భీమారావుని మహిళలు, గ్రామస్తులు అడ్డుకొని నిలదీశారు. గ్రామానికి సంబంధించిన రూ.రెండు లక్షల నలభై వేలు నగదు, 40 సిమెంట్ బస్తాలు 2014లో అప్పుగా తీసుకొని అంతవరకు ఒక్క పైసా కూడా ఎందుకు ఇవ్వలేదని నిలదీశారు. వడ్డీతో సహా తక్షణమే చెల్లించాలని అన్నారు. అధికారాన్ని ఉపయోగించి భయపెట్టాలని చూస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. మహిళలు, గ్రామస్తులు నిలదీయడంతో భయపడి నౌపడ పోలీస్ స్టేషన్‌లో దాక్కున్నారు.




టెక్కలి డీఎస్పీ కార్యాలయం ముట్టడించిన మూలపేట గ్రామస్తులు

రెడ్‌బుక్ రాజ్యాంగం హద్దు మీరుతోంది

- వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్
- టెక్కలి డీఎస్పీ కార్యాలయం ముట్టడి

టెక్కలి: రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేయడం కోసం టెక్కలి నియోజకవర్గంలో పోలీసులు హద్దు మీరుతున్నారని వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ మండిపడ్డారు. సంతబొమ్మాళి మండలం మూలపేట గ్రామానికి చెందిన జీరు విశ్వనాథంపై నౌపడ ఎస్‌ఐ నారాయణస్వామి విచక్షణ రహితంగా దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు టెక్కలి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడిని తిలక్ పరామర్శించారు. ఎస్‌ఐ నారాయణస్వామి తీరును తప్పుబడుతూ మూలపేట గ్రామస్తులంతా టెక్కలి డీఎస్పీ కార్యాలయాన్ని ముట్టడించారు. అనంతరం పేరాడ తిలక్‌తో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు, మూలపేట గ్రామస్తులు డీఎస్పీ లక్ష్మణరావును కలిసి ఫిర్యాదు చేశారు. నౌపడ ఎస్‌ఐతో పాటు సీఐ చేస్తున్న విధ్వంసాలపై ఉన్నతాధికారులు దృష్టి సారించాలన్నారు. అచ్చెన్నాయుడు చెప్పాడని, మూలపేటలో భీమారావు చెప్పాడని పోలీసులు అన్యాయంగా ప్రవర్తిస్తే సహించేది లేదని తిలక్ అన్నారు. ఎస్‌ఐపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయనతో పాటు మూలపేట సర్పంచ్ జీరు బాబూరావు, సంతబొమ్మాళి పార్టీ అధ్యక్షుడు బి.మోహన్‌రెడ్డి, నాయకులు కె.గోవింద్, ఎం.అప్పారావు, దొర, ఎం.నాగభూషణ్ తదితరులు ఉన్నారు.



విశ్వనాథంను పరామర్శిస్తున్న పేరాడ తిలక్

క్లుప్తంగా

ఉర్లాం వీఏఏ సస్పెన్షన్

నరసన్నపేట: ఉర్లాం సచివాలయంలో పనిచేస్తున్న విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ గోలపల్లి భాస్కరరావును జిల్లా వ్యవసాయ అధికారి త్రినాథస్వామి సస్పెండ్ చేస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉర్లాంలో రైతుల నుంచి ఎరువు ఇస్తామని డబ్బులు వసూలు చేసి తన సొంతానికి వాడుకున్న విషయం విదితమే. ఈ మేరకు గ్రామంలో విచారణ చేపట్టిన నరసన్నపేట ఏడీ మధు నివేదిక పంపగా త్రినాథస్వామి చర్యలు తీసుకున్నారు. కాగా ఎరువుల కోసం డబ్బులు ఇచ్చిన రైతులు లబోదిబోమంటున్నారు. ఆయన నుంచి డబ్బులు వాపసు చేయాలని కోరుతున్నారు. ఇవ్వకపోతే ఆయన ఇచ్చిన రసీదులు ఆధారంగా పోలీసులకు ఫిర్యాదు చేస్తామని చెబుతున్నారు. కాగా రైతులు, పింఛన్‌దారుల డబ్బు సొంతానికి వాడుకున్న వీఏఏపై అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేయకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కాగా పింఛన్ డబ్బులు గురువారానికీ భాస్కరరావు కట్టలేదు. ప్రభుత్వ నిబంధనల మేరకు పింఛన్ డబ్బు మిగిలితే వెంటనే సంబంధిత సచివాలయంలో కట్టాలి. 25 మందికి పింఛన్ ఇవ్వనట్లు యాప్‌లో స్పష్టంగా ఉన్నప్పటికీ ఆ డబ్బు రికవరీ చేయడంలో అధికారులు తాత్సారం చేస్తుండటం పట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పెట్రోల్‌లో నీరు వచ్చిందంటూ ఆందోళన



పెట్రోల్‌లో నీరు కలిసిందని బాటిల్ చూపుతున్న వినియోగదారుడు

నరసన్నపేట: స్థానిక కామేశ్వరి ఎంటర్‌ప్రైజస్ పెట్రోల్ బంకు వద్ద గురువారం సాయంత్రం ఉద్రిక్తత నెలకొంది. రెడ్డికిపేటకు చెందిన యువకుడు ద్విచక్ర వాహనంలో రూ.300 పెట్రోల్ కొట్టించాడు. తర్వాత వాహనం స్టార్ట్ చేస్తే కాలేదు. దగ్గర్లో ఉన్న మెకానిక్ వద్దకు తీసుకెళ్లినా ఫలితం లేకపోయింది. పెట్రోల్ కల్తీ అయిందని భావించి గమనించగా పెట్రోల్‌తో పాటు వాటర్ వచ్చింది. వెంటనే వాహనదారుడు బంకు వద్దకు వెళ్లి సిబ్బందిని నిలదీశాడు. సిబ్బంది, యజమాని నిర్లక్ష్యంగా సమాధానం ఇవ్వడంతో రెడ్డికిపేటకు చెందిన యువకులు వచ్చి ఆందోళన చేపట్టారు. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

8న అప్రెంటిస్ మేళా

ఎచ్చెర్ల : ఎచ్చెర్ల ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఈ నెల 8న ప్రధాన మంత్రి జాతీయ అంప్రెంటిస్ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్, కన్వీనర్ ఎల్.సుధాకరరావు గురువారం తెలిపారు. 11 కంపెనీలలో అప్రెంటిస్ ఖాళీలు భర్తీ చేయనున్నట్లు చెప్పారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐలలో వివిధ ట్రేడ్‌లలో శిక్షణ పూర్తి చేసిన విద్యార్థులు ధ్రువపత్రాలతో హాజరుకావచ్చన్నారు. మైనింగ్ సొల్యూషన్ లిమిటెడ్ (పొన్నాడ), అరబిందో (పైడిభీమవరం), శ్యాంక్రగ్ పిస్టన్స్ (అరిణాం అక్కివలస), నాగార్జున అగ్రికెం లిమిటెడ్ (చిలకపాలెం), హాస్పిటల్స్ (పారామెడికల్) తదితర కంపెనీల ప్రతినిధులు హాజరవుతారని పేర్కొన్నారు.

కొమనాపల్లి కేంద్రంగా.. మద్యం దందా!



కొమనాపల్లి వైన్‌షాప్ నుంచి సంచిలో మందుబాటిళ్లు తీసుకెళ్తున్న బెల్ట్‌షాప్ నిర్వాహకుడు

- యథేచ్ఛగా బెల్టుషాపులకు మద్యం తరలింపు
- అనుమతులు కొన్ని గ్రామాలకే.. అమ్మకాలు రెండు మండలాలకు..
- క్వార్టర్ బాటిల్‌పై అదనంగా రూ.50 వసూలు!
- తూతూమంత్రంగా అధికారుల తనిఖీలు

జలుమూరు: కూటమి ప్రభుత్వం వచ్చాక మద్యం దందాకు అడ్డూ అదుపు లేకుండాపోతోంది. జలుమూరు మండలం కొమనాపల్లి కేంద్రంగా గ్రామాల్లోని బెల్టుషాపులకు మద్యం అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. అటు సరుబుజ్జిలి, ఇటు హిరమండలం వరకూ ఇక్కడి వైన్ షాపు నుంచి మందు సరఫరా జరుగుతోంది. షాపు నిర్వాహకులు నిబంధనలకు తూట్లు పొడుస్తున్నా ఏ ఒక్క అధికారీ పట్టించుకున్న దాఖలాలు లేవు. వాస్తవానికి ఇక్కడ పర్మిట్ రూమ్‌కు అనుమతులు లేవు. అయినా షాప్ చుట్టూ దాబా, నూడిల్స్, ఇతర తినుబండారాలు షాప్‌లు పెట్టి అక్కడే కుర్చీలు, బెంచీలు వేసి బహిరంగంగా మందుబాబులు మద్యం సేవిస్తుంటారు. ఈ సమయంలో సంబంధిత ఎక్సైజ్ శాఖ అధికారులు వచ్చినా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కేవలం రికార్డులు తనిఖీలు చేసి అమ్మకాలు, కొనుగోళ్లు చూస్తున్నారే తప్ప బెల్ట్ షాప్‌లు, మద్యం అక్రమ రవాణాపై కనీసం పట్టించుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఏ ఊరుకెళ్లినా బెల్టుషాపులే..

కొమనాపల్లి మద్యం షాప్ నుంచి ఇటు సరుబుజ్జిలి మండలం తెలికిపెంట, యరగాం, పాతపాడు, చిన్నకాగితాపల్లి, పెద్దమాలపేట, అగ్రహారం, లొద్దలకాగితాపల్లి తోపాటు మరో 20 గ్రామాలు, అటు హిరమండలంలోని కిట్టలపాడు కాలని, అక్కరాపల్లి, రెల్లివలస, అంబావిల్లి, పిండ్రువాడతో పాటు మరో 15 గ్రామాలు, జలుమూరు మండలం కొమనాపల్లి, శ్రీముఖలింగం, నగిరికటకం, కరకవలస, యలమంచిలి, తిమడాం, అల్లాడ, పర్లాం, మాకివలస, అందవరం మరో 16 గ్రామాలకు ఈ షాప్ నుంచి మద్యం సరఫరా చేస్తున్నట్లు సమాచారం.

అదనపు వసూళ్లు..

షాపు ఉదయం తెరిచిన వెంటనే ఆయా బెల్ట్‌షాప్‌లు, పర్మిట్ రూమ్ నిర్వాహకుల సెల్‌కు మెసేజ్ వెళ్తుంది. వెంటనే వారు వచ్చి ఆటో, ద్విచక్ర వాహనాల ద్వారా దర్జాగా మద్యం బాటిళ్లు తీసుకెళ్లిపోతారు. ఉదయం 9 గంటల లోపల అవసరం పడితే ఒక్కో క్వార్టర్ బాటిల్‌కు రెట్టింపు ధర వసూలు చేస్తున్నారు. అదే 10 గంటలు దాటితే క్వార్టర్ బాటిల్‌కు రూ.50 అదనం. బెల్ట్‌షాప్, పర్మిట్ రూమ్‌లకు షాప్ నిర్వాహకులే నేరుగా మద్యం తీసుకెళ్తే క్వార్టర్‌కు రూ.70 వరకు వసూలు చేస్తుంటారు. రెండు నుంచి మూడు కిలోమీటర్లు దూరమైతే కాస్త ధర తగ్గించి అమ్మకాలు చేస్తున్నారు.

మంత్రి బంధువులనే వెనుకంజ..

కొమనాపల్లి మద్యం షాపు నిర్వాహకులు జిల్లాకు చెందిన మంత్రి సమీప బంధువు. ఎక్సైజ్ కార్యాలయం కూడా మంత్రి ఇలాకాలోని కోటబొమ్మాళిలో ఉండటంతో అధికారులు తనిఖీలకు వెనకంజ వేస్తున్నారని పలువురు చెబుతున్నారు.

ఫిర్యాదు రాలేదు..

ఈ విషయమై కోటబొమ్మాళి ఎక్సైజ్ శాఖ ఎస్ఐ ఆర్.సీత వద్ద ప్రస్తావించగా కొమనాపల్లి మద్యం షాపుపై మాకు ఎటువంటి ఫిర్యాదు రాలేదని చెప్పారు. అయినా సిబ్బందితో వెళ్లి తనిఖీలు నిర్వహించి అక్రమాలు తేలితే చర్యలు తీసుకుంటామన్నారు.

చోరీకి గురైన బైకులు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వివేకానంద

పొందూరు: చోరీకి గురైన నాలుగు బైకులను, ఓ లగేజీ ఆటోను టెక్నాలజీ సాయంతో స్వాధీనం చేసుకున్నామని శ్రీకాకుళం డీఎస్పీ సీహెచ్ వివేకానంద తెలిపారు. పొందూరు పోలీసుస్టేషన్ పరిధిలో చోరీకి గురైన వాహనాలు స్వాధీనం చేసుకోవడంతో గురువారం విలేకరులకు వివరాలు వెల్లడించారు. మండలంలోని పలు గ్రామాల్లో కార్డన్‌సెర్చ్ చేస్తున్న సమయంలో తమ బైకులు చోరీకి గురైనట్లు ఫిర్యాదులు వచ్చాయని చెప్పారు. బైక్‌ను పోగొట్టుకున్న యజమాని ఫోన్‌కు వచ్చిన మెసేజ్ ఆధారంగా సాంకేతికతను ఉపయోగించుకుని బైక్‌లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. శ్రీకాకుళం మంగువారి తోటకు చెందిన బొమ్మలాట మోహనరావు, బొమ్మలాట ఢిల్లీశ్వరరావు, తోట శ్రీనివాసరావు, మెండ శివలు వాహనాలు చోరీ చేసి విక్రయిస్తున్నట్లు గుర్తించామని చెప్పారు. వీరిలో బైకు దొంగతనం కేసులో జైలు శిక్ష అనుభవిస్తున్న మోహనరావు మూడు ద్విచక్రవాహనాలను, ఢిల్లీశ్వరరావు ఒక ద్విచక్రవాహనాన్ని చోరీ చేసినట్లు తెలిపారు. తోట శ్రీనివాసరావు, మెండ శివలు కొత్తూరులో చోరీ చేసిన లగేజి ఆటోను కూడా స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఇటువంటి చోరీ చేసిన వాహనాలను ఢిల్లీశ్వరరావు కొనుగోలు చేసి విక్రయిస్తుంటాడని తెలిపారు. నాలుగు ద్విచక్రవాహనాలు, లగేజి ఆటోను ఢిల్లీశ్వరరావు నుంచి స్వాధీనం చేసుకుని అరెస్టు చేసినట్లు తెలిపారు. ఈ వాహనాలన్నీ పొందూరు మండలం రాపాక గ్రామసుతలకు చెందినవిగా గుర్తించామని చెప్పారు. జైలులో ఉన్న మోహనరావును పూర్తి స్థాయిలో విచారిస్తే మరికొన్ని ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకొనే అవకాశం ఉందన్నారు. చోరీకి గురైన వాహనాల విలువ సుమారు రూ.4 లక్షలు ఉంటుందని చెప్పారు. కేసు ఛేదనలో ప్రతిభ చూపిన ఎస్సై వి.సత్యనారాయణ, సిబ్బందిని ఎస్పీ అభినందించినట్లు తెలిపారు. డీఎస్పీతో పాటు సీఐ పి.సత్యనారాయణ, ఎస్ఐ వి.సత్యనారాయణ, ట్రైనీ ఎస్ఐ మోహిని, పోలీసు సిబ్బంది ఉన్నారు.

సమస్యాత్మక గ్రామాలపై దృష్టి...

నాలుగు నెలల్లో స్థానిక సంస్థల ఎన్నికలు జరిగే అవకాశం ఉన్నందున సమస్యాత్మక గ్రామాలపై దృష్టి సారించినట్లు డీఎస్పీ తెలిపారు. పొందూరు మండలంలో ఇప్పటి నుంచే సమస్యాత్మక గ్రామాలలో సమావేశాలు నిర్వహించి వివాదాలు లేకుండా ప్రయత్నాలు చేస్తామన్నారు. ఈసారి బైండోవర్ కేసులలో చిక్కుకుంటే రూ. 2 లక్షలు జరిమానా చెల్లించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

విద్యార్థి ఆకస్మిక మృతి



ప్రదీప్‌రెడ్డి(ఫైల్)

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాకేంద్రంలోని ఓ ప్రయివేటు కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థి తీవ్ర అస్వస్థతకు గురై మృతిచెందడం స్థానికంగా కలకలం రేపింది. వివరాల్లోకి వెళ్తే.. నగరంలోని కృష్ణాపార్కు సమీపంలో పకోడి కొట్టు నిర్వహిస్తున్న నిమ్మ మహేష్ కుమారుడు ప్రదీప్‌రెడ్డి(18) కళాశాలలో గురువారం నిర్వహించిన గురుపూజా మహోత్సవాలకు హాజరయ్యాడు. తీన్మార్ పెట్టడంతో విద్యార్థులంతా ఆనందంగా గడిపారు. సాయంత్రం 3.54 గంటలకు ప్రదీప్ ఒక్కసారిగా కుప్పకూలాడు. వెంటనే కళాశాల యాజమాన్యం నగరంలోని ఓ ప్రయివేటు ఆసుపత్రికి తరలించగా అప్పటికే విద్యార్థి మృతిచెందినట్లు వైద్యులు ధృవీకరించారు. తీన్‌మార్ డప్పులు, రెండు బాక్సుల్లో శబ్దకాలుష్యం వల్లే విద్యార్థి చనిపోయి ఉంటాడని స్థానికులు చర్చించుకుంటున్నారు. కాగా, తమ కుమారుడు అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడని విద్యార్థి తల్లిదండ్రులు చెబుతున్నారు. తమకు ఫిర్యాదు అందలేదని రెండో పట్టణ సీఐ తెలిపారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు



తీవ్ర గాయాలపాలైన శంకరరావు

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాకేంద్రంలోని ఆర్టీసీ కాంప్లెక్సు ఇన్‌గేట్ వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ట్రాఫిక్ సీఐ నాగరాజు తెలిపిన వివరాల మేరకు.. రాజాం మండలం కంచరాం సమీపంలోని రాజయ్యపేటకు చెందిన గునుపూరి శంకరరావు (53) రిమ్స్ ప్రభుత్వాసుపత్రికి వైద్యచికిత్సల నిమిత్తం వచ్చాడు. అనంతరం ఆర్టీసీ కాంప్లెక్స్ వైపు నడిచి వస్తుండగా టెక్కలి నుంచి విశాఖ వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు లోపలికి వెళ్లే క్రమంలో శంకరరావును ఢీకొట్టింది. ఈ ఘటనలో బస్సు వెనుక చక్రాలు కాలుపై వెళ్లడంతో తీవ్ర గాయాలయ్యాయి. అక్కడే విధుల్లో ఉన్న ట్రాఫిక్ పోలీసులు క్షతగాత్రుని బస్సు కింద నుంచి లాగి రిమ్స్‌కు తరలించారు. శంకరరావుకు భార్య రాములమ్మ, కుమార్తె ఉన్నారు. ఊరూరా తిరిగి చిరు వ్యాపారం చేస్తున్న భర్తకు ఇలా జరగడంతో తమ గతేంటని భార్య రిమ్స్ వద్ద విలపించింది. ఆర్టీసీ డ్రైవర్ నిర్లక్ష్యం వల్లే ఈ ప్రమాదం జరిగినట్లు ట్రాఫిక్ పోలీసులు నిర్ధారించారు. ఎస్ఐ మెట్ట సుధాకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బీసీ హాస్టళ్లను కాపాడుకుందాం

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): సమస్యలపై పోరాడి బీసీ హాస్టళ్లను కాపాడుకుందామని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే సంక్షేమ వసతి గృహాలు సమస్యలకు నిలయాలుగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. పాలకులు తక్షణమే స్పందించి మెస్, కాస్మొటిక్ చార్జీలు పెంచాలని, శాశ్వత భవనాలు నిర్మించాలని, ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఆయనతో పాటు ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు రాజమహంతి భానుచందర్ తదితరులు ఉన్నారు.

రిమ్స్‌లో సెక్యూరిటీ గార్డుపై దాడి

శ్రీకాకుళం: రిమ్స్ ఆసుపత్రి సెక్యూరిటీ గార్డుపై ఓ వ్యక్తి దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. సెక్యూరిటీ గార్డు సురేష్ గురువారం ఉదయం ఆర్థోపెడిక్ డాక్టర్ గోపి వద్ద విధులు నిర్వహిస్తున్నాడు. ఒప్పంగి సమీపంలోని చల్లపేటకు చెందిన చిన్నప్పన్న అనే వ్యక్తి వైద్యం కోసం రిమ్స్ ఆర్థోపెడిక్ విభాగం వద్ద క్యూలో నిల్చున్నాడు. ఇటీవల శస్త్ర చికిత్స జరిపించుకున్న వారు వచ్చి వైద్యులకు సంప్రదించేందుకు క్యూ పాటించకుండా వెళ్లిపోతున్నారు. దీనిపై గార్డు సురేష్‌ను చిన్నప్పన్న నిలదీశాడు. ఈ విషయం ఏదోలా సద్దుమణిగిపోగా, నెలల వయసున్న చిన్నారితో ఓ మహిళ చికిత్స కోసం అక్కడికి వచ్చింది. చిన్నపిల్లాడితో క్యూలో నిల్చోలేనని, తనను నేరుగా పంపించాలని గార్డును కోరగా నిరాకరించాడు. క్యూలో ముందులో నిలబడిన కొందరు మహిళలను ఆమె బతిమాలి లోపలికి వెళ్లింది. దీంతో ఆగ్రహించిన చిన్నప్పన్న తనను పంపించకుండా ఆమెను ఎలా పంపించావంటూ సెక్యూరిటీ గార్డుతో వాగ్వాదానికి దిగాడు. ఈ క్రమంలోనూ సురేష్పై దాడి చేయడంతో గాయాలయ్యాయి. కాగా దాడి చేసిన చిన్నప్పన్న కూడా దుప్పలవలస ప్రభుత్వ పాఠశాలలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తుండడం గమనార్హం. ఈ వ్యవహారానికి సంబంధించి ఎటువంటి పోలీస్ కేసులు నమోదు కాకపోగా, తరచూ తమపై రోగులు, రోగుల సహాయకులు దాడులు చేస్తున్నారని, దీనిపై చర్యలు తీసుకోవాలని రిమ్స్ అధికారులను సెక్యూరిటీ గార్డులు కోరారు. ఈ విషయమై పాఠశాల ప్రిన్సిపాల్‌తో ఇప్పటికే రిమ్స్ సెక్యూరిటీ ఇన్‌చార్జ్ మాట్లాడినట్లు తెలిసింది.

వృద్ధుడి హత్య కేసులో తొమ్మిది మంది అరెస్టు

పలాస : కేశుపురం గ్రామానికి చెందిన వృద్ధుడు ఉంగ రాములు (80) హత్య కేసులో అదే గ్రామానికి చెందిన 8 మందిని, అందుకు కారణమైన భూత వైద్యుడిని కాశీబుగ్గ పోలీసులు అరెస్టు చేశారు. చేతబడి నెపంతో మంగళవారం రాత్రి రాములును అతి దారుణంగా రాళ్లు, కర్రకత్తులతో దాడికి పాల్పడిన హత్య చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు గురువారం కాశీబుగ్గ పోలీసుస్టేషన్‌లో సీఐ పి.సూర్యనారాయణ విలేకరులకు వివరాలు వెల్లడించారు. కేశుపురం గ్రామానికి చెందిన అంబలి తులసీరావుకు కొన్నాళ్లుగా ఆరోగ్యం బాగాలేదు. కుటుంబీకులు సంతబొమ్మాళి మండలం బోరుబద్ర గ్రామానికి చెందిన రెయ్యన్న దాసుడు(భూత వైద్యుడు)పొందూర గణపతిరావును సంప్రదించారు. మంగళవారం రాత్రి తులసీరావు ఇంట్లో చేతబడి (పూజలు) చేయించారు. దాసుడు వెళ్లిపోయిన తర్వాత తులసీరావు కుటుంబీకులు, బంధువులు కలిసి రాములు ఇంటిపైకి వెళ్లి అతనిపై పసుపు నీరు పోసి బయటకు ఈడ్చుకొచ్చారు. కుటుంబీకుల సమక్షంలోనే రాళ్లు, కర్రలతో తీవ్రంగా కొట్టారు. నీవు చిల్లంగి పెట్టడం వల్లే గతంలో కోనారి పున్నయ్య చనిపోయాడని, ఇప్పుడు మరొకరిని చంపుతావా అంటూ చితక్కొట్టారు. ఈ సమయంలో రాములు మనవడు చరణ్ అడ్డుకోగా అతనిపైనా దాడికి తెగబడ్డారు. రాములుకు తీవ్ర రక్తస్రావం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై చరణ్ కాశీబుగ్గ పోలీసులకుఫిర్యాదు చేయడంతో డీఎస్పీ వెంకటప్పారావు, సీఐ పి.సూర్యనారాయణ గ్రామానికి వెళ్లి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ ఘటనకు కారణమైన అదే గ్రామానికి చెందిన అంబలి తులసీరావు, సరిపల్లి రాజ్‌కుమార్, అంబలి చంద్రశేఖర్, అంబలి భీమారావు, బుడ్డ తేజేశ్వరరావు, బుడ్డ లక్ష్మీకాంత్, కోనారి సూర్యనారాయణ, అంబలి వెంకటలక్ష్మి, భూత వైద్యుడు పొందూరు గణపతిరావులను అరెస్టు చేశారు. వీరిని పలాస జూనియర్ సివిల్ జడ్జి ఎదుట హాజరుపరిచారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కాశీబుగ్గ సీఐ చెప్పారు.

అదృశ్యమైన వ్యాపారి హత్య?

నరసన్నపేట: స్థానిక లక్ష్మన్నపేటకు చెందిన బంగారం వ్యాపారి వెంకట పార్వతీశ్వం గుప్త హత్యకు గురై ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ వార్త నరసన్నపేట పట్టణంలో గురువారం దావానంలా వ్యాపించడంతో ఇటు స్థానికులు, అటు బంగారం వ్యాపారుల్లో కలకలం రేపింది. నిరుపేద కుటుంబానికి చెందిన గుప్త అంచెలంచెలుగా ఎదిగి ఆర్థికంగా ఉన్నత స్థాయికి చేరుకున్నారు. ఇప్పటి వరకూ వివాహం చేసుకోని ఆయనకు సోదరుడు మన్మథరావే అన్నీ. మంచి స్థాయికి వెళ్లిన గుప్త ఇక హాయిగా జీవించేందుకు ప్లాన్ వేసుకోగా ఇంతలో హత్యకు గురికావడం స్థానికులను కలిచివేస్తుంది.

కారు డ్రైవర్ జవ్వాది సంతోష్ మరొకరితో కలిసి గుప్తను హత్య చేసి ఆయన వద్ద ఉన్న కేజీన్నర బంగారు ఆభరణాలు తీసుకుపోయినట్లు తెలుస్తోంది. పెద్దపాడు వద్ద కారు విడిబాగాలు అమ్మే షాపు యజమాని పాత్ర కూడా ఈ కేసులో ప్రముఖంగా వినిపిస్తోంది. సంతోష్‌తో కలసి ఈయన ఈ హత్యకు పథకం వేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. సంతోష్ భార్య ప్రశాంతితోపాటు స్థానిక సిటీ కేబుల్‌లో పనిచేసే బొరిగివలసకు చెందిన మణి అనే వ్యక్తిని కూడా పోలీసులు విచారిస్తున్నారు. వీరిద్దరి ఇళ్లల్లో కొన్ని బంగారు ఆభరణాలు, గోల్డ్ బిస్కెట్స్ పోలీసులు రికవరీ చేసినట్లు సమాచారం. కాగా గుప్తను గత నెల 26వ తేదీనే హత్య చేసి ఆ మరుసటి రోజు సంతోష్ తన భార్య ప్రశాంతి, బొరిగివలసకు చెందిన మణితో కలిసి తిరుపతికి వెళ్లారు. ఆ సమయంలో సంతోష్ ఫోన్ స్విచ్ఛాప్ చేసి ఉండటాన్ని గమనించిన పోలీసులు ఆయనపై నిఘా పెట్టారు. వీరు ముగ్గురూ తిరుపతిలో వస్త్రాలు షాపింగ్ చేసినట్లు గుర్తించారు. తిరుపతికి వెళ్లే ముందు సంతోష్ నరసన్నపేటలో ఓ వ్యాపారి వద్ద గుప్త నుంచి కాజేసిన కొన్ని బంగారు ఆభరణాలు తాకట్టు పెట్టి లక్ష రూపాయల వరకూ తీసుకోగా ఈ వ్యాపారిని కూడా పోలీసులు విచారించి ఆయన ఆభరణాలను రికవరీ చేసినట్లు సమాచారం.

మృతదేహం కోసం గాలింపు..

గుప్త మృత దేహం కోసం పోలీసులు తీవ్రంగా గాలిస్తున్నారు. నిందితులుగా అనుమానిస్తున్న సంతోష్, కారు విడిబాగాలు వ్యాపారి ఇచ్చిన సమాచారం మేరకు శ్రీకాకుళం రూరల్ మండలం పాత్రునివలస, పెద్దపాడు సమీపాల్లో గజ ఈతగాళ్ల సహాయంతో కాలువలు, గెడ్డల్లో వెతికిస్తున్నారు. వర్షాలు అధికంగా పడటంతో మృతదేహం కొట్టుకుపోయి ఉంటుందని భావిస్తూ పరిసర ప్రాంతాల్లో గాలింపు ముమ్మరం చేశారు.అయితే గుప్త హత్యోదంతంలో ఎవరెవరు ఉన్నారు.. ఎక్కడ ఎలా హత్య చేశారు.. అనే వివరాలు తెలియాల్సి ఉంది.

పంట పొలంలో గుర్తు తెలియని మృతదేహం



పొలంలో పడి ఉన్న మృతదేహం

శ్రీకాకుళం రూరల్: రాగోలు జెమ్స్ ఆస్పత్రి దాటాక గూడేం వెళ్లే దారిలో వైన్‌షాప్ ఎదురుగా పంట పొలాల్లో గురువారం గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. మృతుడి వయస్సు 35 నుంచి 40 ఏళ్లు ఉండవచ్చని భావిస్తున్నారు. నీలం వైట్ చెక్స్ టీషర్టు, నలుపు ఫ్యాంట్ ధరించి ఉన్నాడు. శరీరంపై గాట్లు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. మృతి చెంది సుమారు వారం గడిచి ఉంటుందని భావిస్తున్నారు. దుర్వాసన వెదజల్లుతూ గుర్తు పట్టలేని విధంగా మారింది. విషయం తెలుసుకున్న టౌన్ సీఐ పైడపునాయుడు, సిబ్బంది, క్లూస్‌టీం ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. వివరాలు తెలిస్తే శ్రీకాకుళం రూరల్ పోలీసులను సంప్రదించాలని ఎస్ఐ రాము కోరారు.

బంగారు వ్యాపారి అంటూ పుకార్లు..

గుర్తు తెలియని మృతదేహాన్ని చూసిన స్థానికులు ఇటీవల నరసన్నపేటలో అదృశ్యమైన ఓ బంగారు వ్యాపారిగా భావించడం కలకలం రేపింది. వెంటనే రూరల్ పోలీసులు నరసన్నపేట పోలీసులతో పాటు కుటుంబ సభ్యులను సంప్రదించగా వారు వచ్చి చూసి వ్యాపారి మృతదేహం కాదని నిర్ధారణ చేశారు.

గంజాయి రవాణా గుట్టురట్టు



పట్టుబడిన నిందితులతో కాశీబుగ్గ పోలీసులు

పలాస: గంజాయి తరలిస్తున్న ఒడిశాకు చెందిన ముగ్గురిని అరెస్టు చేసినట్టు కాశీబుగ్గ సీఐ పి.సూర్యనారాయణ చెప్పారు. కాశీబుగ్గ పోలీసు స్టేషన్‌లో గురువారం విలేకరులకు వివరాలు వెల్లడించారు. ఒడిశా రాష్ట్రం గజపతి జిల్లా నియోగుడ గ్రామానికి చెందిన అరబింద ఆనంద్, తబరద గ్రామానికి చెందిన మైకేల్ రైతా, సెరంగో గ్రామానికి చెందిన ప్రాతిమా లిమ్మాలను పర్లాకిమిడి మీదుగా పలాస రైల్వే స్టేషన్‌కు బుధవారం రాగా పలాస రైల్వే స్టేషన్ కూడలి వద్ద పట్టుకుని విచారించారు. వారి వద్ద 16.435 కిలోల గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. బైక్, రెండు సెల్‌ఫోన్లు, రూ.1580 నగదును స్వాధీనం చేసుకున్నారు. వీరిని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

బైక్‌పై తరలిస్తుండగా..

ఇచ్ఛాపురం రూరల్: ఒడిశా నుంచి ద్విచక్రవాహనంపై గంజాయిని తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు సీఐ ఎం.చిన్నంనాయుడు తెలిపారు. గురువారం ఇచ్ఛాపురం పట్టణ సర్కిల్ కార్యాలయంలో కవిటి ఎస్ఐ వి.రవివర్మతో కలిసి విలేకరులకు వివరాలు వెల్లడించారు. ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లా కొడల గ్రామానికి చెందిన సాగర్ బెహరా, అతని స్నేహితుడు పీతల గ్రామానికి చెందిన బాలుడు రాజేష్ జెన్నాతో కలిసి గురువారం ఒడిశా నుంచి స్థానిక 16వ నెంబర్ జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనంపై 21.030 కేజీల గంజాయిని తరలిస్తుండగా కవిటి పోలీసులు కొజ్జిరియా ఫ్లైఓవర్ బ్రిడ్జిపై పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రెండు సెల్‌ఫోన్లు స్వాధీనపరచుకున్నామన్నారు. పలాస చేరుకొని అక్కడి నుంచి రైలు మార్గం ద్వారా గుజరాత్ రాష్ట్రం సూరత్‌లో స్పిన్నింగ్ మిల్లులో కూలీగా పనిచేస్తున్న దేవేంద్ర పండికి ఇచ్చేందుకు వెళ్తున్నట్లు పోలీసులు గుర్తించారు. డబ్బులకు ఆశపడి గంజాయి వ్యాపారీ సమీర్ సాహూ వద్ద నుంచి గంజాయిని తరలిచేందుకు అంగీకరించినట్లు నిందితులు తెలిపారు.

లారీ ఢీకొని వ్యక్తి దుర్మరణం



శ్రీనివాసరావు మృతదేహం

టెక్కలి రూరల్: కోటబొమ్మాళి మండలం చిన్నబమ్మిడి జంక్షన్ వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గార మండలం శ్రీకూర్మం గ్రామానికి చెందిన జగలింగు శ్రీనివాసరావు(39) మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీనివాసరావు చిన్నబమ్మిడి జాతీయ రహదారిపై నడుచుకుంటూ వెళ్తుండగా వెనుక నుంచి వచ్చిన గుర్తు తెలియని లారీ ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. శ్రీనివాసరావు తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఎస్ఐ వి.సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తికి తీవ్ర గాయాలు



రిమ్స్‌లో చికిత్స పొందుతున్న భాస్కరరావు

మెళియాపుట్టి : మారడికోట పంచాయతీ సవర చీడిపాలెం గ్రామంలో గురువారం విద్యుత్ షాక్‌కు గురై ఓ వ్యక్తి తీవ్ర గాయాలపాలయ్యాడు. సవర భాస్కరరావు తన ఇంటి మేడపైకి వెళ్లి కరెంట్ తీగలను కదపడంతో షాక్‌కు గురై హైటెన్షన్ వైర్లకు అతుక్కుపోయాడు.వెంటనే గ్రామస్తులు ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లి సరఫరా నిలిపివేయడంతో కింద పడిపోయాడు. బాధితుడిని టెక్కలి జిల్లా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో శ్రీకాకుళం రిమ్స్‌లోచేర్పించారు. అయితే కరెంట్ తీగలను ఎందుకు కదపడానికి వెళ్లాడు అనే దానిపై స్పష్టత లేదు. భాస్కరరావు భార్య మూడేళ్ల కిందటే ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుస్తోంది. ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

బైక్ నుంచి జారిపడి మహిళ మృతి

ఎచ్చెర్ల: సంతసీతారాంపురం సమీపంలో గురువారం జరిగిన ప్రమాదంలో రణస్థలం మండలం కొచ్చెర్ల గ్రామానికి చెందిన బస్వ పార్వతి (49) మృతిచెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చర్మ సంబంధిత సమస్యతో బాధపడుతున్న పార్వతి తన కుమారుడు రామిరెడ్డితో కలసి ద్విచక్రవాహనంపై బుడగట్లపాలెం-సంతసీతారాంపురం మీదుగా రిమ్స్ ఆస్పత్రికి బయలుదేరింది. బైక్ వెనుక కూర్చున్న పార్వతికి ఒక్కసారిగా కళ్లు తిరగడంతో కుమారుడిని గట్టిగా పట్టుకుంది. ఈ సమయంలో బైక్ అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన పార్వతిని 108 అంబులెన్సులో రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. స్వల్పగాయాలతో బయటపడిన రామిరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ-2 అప్పలరాజు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.